కథ

# నిర్ణయం


- పి.ఎస్. నారాయణ

సాయంత్రం అయిదు గంటలు దాటి నలభై నిమిషాలయింది. సూర్యుడు పడమటి కొండల్లోకి జారిపోతున్నట్లుగా అటువైపు ఆకాశమంతా ఎర్రబడుతోంది.

వాకిట్లో ఇంకా పదిమంది దాకా పిల్లలు ఆడుకుంటున్నారు. గోలగోలగా అరుస్తున్నారు. లోపల ఉయ్యాలలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ ఉయ్యాల పక్కగా దమయంతి కూర్చొని వున్నది.

ఒక్క అరగంటలో ఆ పిల్లల తల్లులో, తండ్రులో వచ్చి వాళ్ళను తీసుకు వెళతారు. అప్పటిదాకా పిల్లలతో సందడిగా వున్న ఆ ఇల్లు ఒక్కసారిగా బోసిపోతూ నిశ్శబ్దమయిపోతుంది.

సునంద ఆమె భర్త స్కూటర్ మీద వచ్చారు. ఇద్దరూ ఉద్యోగస్తులే. సంవత్సరం వయస్సులో వున్న తమ కూతుర్ని రుక్మిణి దగ్గర వదిలి వెళతారు ఉదయం తొమ్మిది గంటలకు. మళ్ళా సాయంత్రం ఈ సమయానికి వచ్చి తీసుకు వెళతారు.



రుక్మిణి పాతిక మంది పిల్లల్ని మాత్రమే తన క్రెష్‌లో జేర్చుకుంటుంది. అంతకు మించి వాళ్ళు ఎంత ఇస్తామన్నా తీసుకోవటానికి అంగీకరించదు. ఎవరన్నా ట్రాన్స్‌ఫర్ అయి వెళితేనో లేక మరెవరయినా మరేకారణంతోనయినా వాళ్ళ పిల్లల్ని పంపటం మానివేస్తేనో అప్పుడు వెయిటింగ్ లిస్ట్‌లో వున్న వాళ్ళకు ఫోన్ చేసి చెబుతుంది.

ఆమె చెప్పేది ఒక్కటే. "నేను నా దగ్గర వుంచుకున్న పాతికమంది పిల్లల్ని నా స్వంత పిల్లల్లా చూసుకుంటాను. వాళ్ళు ఎప్పుడెప్పుడు ఏమేం తింటారో చెప్పండి ఏర్పాటు చేస్తాను. పాలు కూడా మా ఇంట్లో కాచినవే ఇస్తాను... అవసరమొస్తే నేనే డాక్టరును పిలిచి ఫస్ట్ ఎయిడ్ ఇప్పించి అప్పుడు ఫోను చేసి మీకు చెబుతాను... మీరు మీ పిల్లల విషయంలో నిశ్చింతగా వుండవచ్చు!" అని భరోసా ఇవ్వటమే కాకుండా, అలా చెప్పిన మాట ప్రకారం చూస్తుండటం వలనే కాస్త ఖర్చు ఎక్కువయినా చాలామంది తమ పిల్లల్ని అక్కడ జేర్చటానికి వస్తుంటారు.

రోడ్డుమీద దీపాలు వెలుగుతున్న సమయానికి మిగతా పిల్లల్ని కూడా వాళ్ళ వాళ్ళు వచ్చి తీసుకు వెళ్ళిపోయారు. ఆ వెంటనే దమయంతి ఉయ్యాలలోని గుడ్డలు మార్చేసి, హాలు కడిగి, తుడిచి, ఇంత సాంబ్రాణీ ధూపమేసింది. పొద్దున పిల్లలు వచ్చే సమయానికి అన్నీ శుభ్రంగా వుండాలి. అప్పుడు చేయాలంటే కుదరదు.

యాభై సంవత్సరాల దమయంతి ఆ కాంపౌండ్ లోనే నైరుతీ మూలగా వున్న చిన్నగదిలో వుంటుంది. ఆమెకు నా అనేవాళ్ళెవరూ లేరు. చాలా సంవత్సరాలయింది ఆ ఇంట జేరి, ఇరవై నాలుగు గంటలూ అక్కడే ఉండటంతో ఒకవిధంగా ఒంటరిగా వుండే

రుక్మిణికి ఆమే తోడు. ఎవ్వరూ లేని దమయంతికి ఆ ఇల్లే నీడ.

లోపల దమయంతి హాలును శుభ్రం చేస్తుంటే రుక్మిణి వీస్తున్న చల్లటి గాలి కోసమన్నట్లుగా వరండాలో కుర్చీ వేసుకొని కూర్చున్నది.

తన జీవితం... తన తల్లిదండ్రులు తనని ఓ యువరాణిగా పెంచారు. ఓ సామ్రాజ్యానికి ఓ మహారాణిగా చేయాలనుకున్నారు.

నిజమే – తన ఈ క్రెష్‌కు మహారాణి కాకపోతేగదా?

గతం గురించిన ఆలోచనలు ఆమెను ఆవహిస్తుండగా, కాంపౌండ్ బయట ఓ ఆటో ఆగింది. అందులో నుంచి దిగిన మనిషి, గేటు తీసుకొని లోపలకు రావటం చూస్తూనే ఆశ్చర్యపోయింది– ఈ సమయంలో ఎవరా వస్తున్నది అన్నట్లుగా.

మనిషి లావుగా వున్నాడు. కళ్ళకు జోడు. విశాలమైన నుదురు. బట్టతల. ఎక్కడో, ఎప్పుడో చూసినట్లే అనిపిస్తోంది... తన దగ్గరకు రోజూ వచ్చే ఏ పిల్లల తాలూకు మనిషో అయివుండాలి!

ఆయన ముందున్న ఆవరణంతా దాటి, క్రోటన్ చెట్ల మధ్యగా ఆమె కూర్చున్న వరండా మెట్లదాకా వచ్చాడు.

''ఎవరు కావాలండి?'' కళ్ళు చికిలించి ఆయన్నే చూస్తూ కుర్చీలో నుంచి లేచి నిలబడింది.

ఆయన కొద్దిక్షణాలపాటు ఏం చెప్పాలా అన్నట్లుగా, మనస్సులోనే మాటలు కూడగట్టుకుంటూ ఆగాడు.,

''మీరు... మీరు... నువ్వు రుక్మిణివేనా?''

ఆ కంఠం కూడా పరిచయమైన కంఠంలాగానే వున్నది.

ఆమె ఒక్క అడుగు వెనక్కు వేసి కుర్చీని పట్టుకు నిలబడింది.

''అవును.. రుక్మిణినే... మీరు?''

అతడు నవ్వాడు. నవ్వీ నవ్వనట్లుగా నవ్వాడు. ''మర్చిపోయావన్న మాట... సరే... ముప్ఫయి సంవత్సరాల ఎడబాటు ఎంత దగ్గరవాళ్ళనయినా మరిచిపోయేలా చేస్తుందనటంలో అసహజమేమీ లేదు!''

రుక్మిణి ఉలిక్కిపడుతూ ఆయన ముఖంలోకి తరచి తరచి చూడసాగింది.

అవును ఆయనే... తను అయిదేళ్ళు కాపురం చేసింది ఆయనతోటే! ఆయన తన మెళ్ళో తాళిగట్టిన భర్త!!

కలవరపడింది. ముఖమంతా మ్లానమయింది...

ఇన్ని సంవత్సరాల తరువాత ఇప్పుడెందుకొచ్చాడు ఇక్కడకు? అసలు తనిక్కడ ఉన్నట్లుగా ఆయనకెలా తెలిసింది?

నోట మాట పెగలక బిగుసుకుపోయి అలాగే నిలబడిపోయింది రుక్మిణి.


''నేను చిదంబరాన్ని... వయస్సు మీరిన నన్ను, ఈ బట్టతల అవతారంలో చూడగానే గుర్తుపడతావని నేను అనేకోలేదులే!'' అన్నాడు ఆయన నవ్వుతూ.

ఆయన నోట్లోనుంచి వచ్చిన ఆ మాట వింటూనే రుక్మిణి మెడలో నరాలు తెగినట్లుగా విలవిలలాడింది. కోలుకోవటానికి కొద్ది సమయమే పట్టింది. ఏం మాట్లాడాలో తెలియనట్లుగా బిత్తరపోయింది.

రుక్మిణి వెనక్కు తిరిగి వడివడిగా అడుగులు వేస్తూ, ''రండి...!'' అన్నది.

ఆమె వళ్ళంతా తూలుతున్నట్లుగా ఊగిపోతున్నది. స్వేదంతో ముఖమూ, శరీరమూ తడిసిపోతున్నది.

దమయంతి వచ్చింది. వచ్చిన మనిషి ఆమె బంధువులయి వుండవచ్చులే అనుకుంటూ, మెట్ల పక్కగా వున్న నీళ్ళ గాబులోనుంచి, ప్లాస్టిక్ మగ్గుతో నీళ్లు తెచ్చి మెట్లమీద పెట్టింది, ''కాళ్ళు కడుక్కోండి, బాబూ!'' అంటూ.



ఆయన కాళ్ళు కడుక్కొని, లోపలకు వస్తుండగానే, రుక్మిణి ఓ గ్లాసుతో టీపాయ్ మీద మంచినీళ్ళు పెట్టి, తువ్వాలు తెచ్చి ఆయన చేతికి అందించింది. ఆయన చేతులు తుడుచుకుంటూ, వరండాలోనుంచి హాల్లోకి వచ్చాడు ఆమె వెనగ్గా. తెలియని ఆరాటంతో ఆ ఊరు వచ్చిన అతడికి ఆమె కనబడటంతో మనస్థిమితం కలిగింది.

ఆ హాలు చాలా శుభ్రంగా ఉన్నది. ఒక సోఫా. రెండు కుర్చీలు, టీపాయ్... ఓ పక్కగా టీ.వీ.. మరో

పక్క ఫ్రిజ్... మూలగా ఓ చిన్న స్టాండు మీద ఫోను..

రుక్మిణి ఆయన్నే కన్నార్పకుండా చూస్తున్నది.

ఆయన సోఫాలో కూర్చుంటూనే తలెత్తి వంట యింట్లోకి వెళ్ళే ద్వారం మీదగా గోడకున్న ఫొటోను చూచాడు. అతడి శరీరాన్నంతా ఒక్కసారిగా ఉద్విగ్నత ఆవరించింది.

అది తనూ, రుక్మిణీ కలిసి పెళ్ళయిన కొత్తల్లో తీయించుకున్న ఫొటో.

అంటే ఆమెకు తనని మర్చిపోవటం ఇష్టం లేదన్న మాట!

''ఈ ఫొటో ఎక్కడిది నీకు?'' తనకు తెలుసు ఆమె ఒక సాయంత్రం, తను చూస్తుండగానే, తన ఎదుట నుంచే, కట్టుబట్టలతో తనింటినుంచి బయటకు వెళ్ళిపోవటం...

''మీ ఇంటినుంచి తెచ్చుకోలేదు. పెళ్ళయిన కొత్తల్లోది కదా... మా నాన్న కావాలని నా దగ్గరనుంచి ఒకటి తీసుకువెళ్ళాడు అప్పుడు. దాన్ని ఎన్‌లార్జ్ చేయించాను!'' అన్నది ముఖం పక్కకు తిప్పుకొని, కాస్తంత కరుకుదనాన్ని కంఠానికి పులుముకుంటూ.

అతడు ఆమె మాటకు నోరు తెరవలేకపోయాడు.

ఆయన ఇంకేం మాట్లాడలేనట్లుగా ఆ ఫొటోనే చూస్తూ, ''నేను నీకు చాలా అన్యాయం చేశాను, రుక్మిణీ!'' అన్నాడు బేలగా.

''గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ బాధపడటం అర్థంలేని విషయం.. కాఫీ కలుపుకు వస్తాను!'' అంటూ వంటింట్లోకి వెళ్ళి తరువాత ఐదు నిమిషాల్లోనే కాఫీ కలిపి తెచ్చి ఆయన ఎదురుగ్గా టీపాయ్ మీద పెట్టింది.

''నువ్వూ తెచ్చుకో''

''నేను రెండుసార్లే త్రాగేది... ఉదయం, సాయంత్రం... ఈ రోజుకు నా కోటా అయిపోయింది!''

''ఒక్కరోజు.... ఆ నిబంధనను సడలించుకోలేవా?''

''నేను ఏదైనా దీర్ఘంగా ఆలోచించే చేస్తాను.. నిబంధనలను సడలించుకోవటం వలన లాభముంటుందని నేననుకోను!''

– అయితే ఇంకా ఆమెలో మొండితనం వదలలేదన్నమాట – మనస్సు గుసగుసలాడింది, అతడిలో కించిత్ భయాన్ని కలిగిస్తూ.

ఆమె వంట ఇంటి తలుపు దగ్గరే నిలబడింది. ఆమె మనస్సంతా ఆయన్ను చూస్తుంటే అస్తవ్యస్తమయిపోతున్నది.

తన, ఊరికి ఇంత దూరంలో, ఒంటరి బ్రతుకును ప్రశాంతంగా గడుపుతున్న తన దగ్గరకు ఇప్పుడు ఆయన ఎందుకు వచ్చాడో అర్థం కానట్లుగా విలవిలలాడుతోంది...

అసలు తను ఇక్కడ ఉన్నట్లుగా ఎలాతెలిసిందో?

''అమ్మానాన్నా పోయారు గదా... ఒక్కదానివే ఉంటున్నావా?''

''లేదు... నాకు పాతిక మంది పిల్లలు తోడున్నారు... దమయంతి తోడు వున్నది!''

''ఆమె ఎవరు?''

''నాలాగే ఒక అనాథ!''

ఆమె కొద్ది క్షణాలు తటపటాయిస్తున్నట్లుగా ఆగి, ''మీరు ఏమీ తెచ్చుకున్నట్లు లేదు!'' అడిగింది.

''ఎంత పొద్దుబోయినా రాత్రికి గుంటూరు వెళ్ళిపోవాలి... ఒంగోలు నుంచి అక్కడకు పనిమీద వచ్చి మూడు రోజులయింది... లాడ్జిలో పడేశాను పెట్టె... చీకట్లో దారి తెలియకుండా పయినిస్తున్నప్పుడు చేతిలో ఆ బరువు గూడా దేనికని ఇక్కడకు తేలేదు!''

''మగమనిషి లేని ఇల్లుగదా.... మీకు పనికి వచ్చే గుడ్డలు ఏమీలేవు... అందుకే అడిగాను!'' అన్నది తల వంచుకొని

రుక్మిణికి అంతా తత్తరబిత్తరగా వున్నది... ఎక్కడా ఒక్కక్షణం స్థిమితంగా నిలబడలేకపోతున్నది – ముప్పయి సంవత్సరాలు జ్ఞప్తికిరాని తనను వెతుక్కుంటూ ఆయన ఎందుకు వచ్చాడో కారణం తెలుసుకోటానికే ఆమె ఆతృత పడుతున్నది. అతడి ఇప్పటి రాక తన జీవితానికి మరో విస్ఫోటనం కాగూడదు.

తను ఆ ఇంట ఉన్నంతకాలం వ్యాపారంకోసం డబ్బో, డబ్బో అనేవాడు... ఇప్పుడు పూర్తిగా దివాలా తీయలేదుగదా!

మరో గ్లాసులో కాఫీ కలిపి, వరండాలోకి వచ్చి, దాన్ని దమయింతికి ఇస్తూ, ''కాఫీత్రాగి వెళ్ళి నీ గదిలో పడుకో... ఓ గంటాగి టిఫెన్ చేసి పిలుస్తాను.. తీసుకు వెళ్ళి తిందువుగాని!''

దమయంతి కాఫీ గ్లాసు అందుకొని కాంపౌండ్ వాల్ ఆనుకొని వున్న తన గదిలోకి వెళ్ళిపోయింది.

వంట ఇంట్లోకి వెళ్ళిన రుక్మిణి ఓ పళ్ళెంలో గోధుమ పిండి పోసుకొని, కాస్తంత ఉప్పువేసి, స్టీలుగిన్నెతో నీళ్ళు తీసుకుని వచ్చి, తలుపు దగ్గరే నేలమీద కూర్చున్నది.

''మీ భార్య పిల్లలు ఎలా వున్నారు... అవును... మీకెంత మంది పిల్లలేం?'' కాస్త ఎగతాళి కంఠంలో మిళితమై వున్నది.

– చివరకు ఆ వంకతోనే కదా తనని ఆ ఇంట ఉండటానికి వీల్లేనంతగా హింసించింది!


పెళ్ళయిన మొదటి సంవత్సరం బాగానే గడిచిపోయింది సంతోష సరాగాల మధ్య. రెండో సంవత్సరం ఆయనకు వ్యాపారంలో ఇబ్బంది వచ్చినప్పుడు, తన పుట్టింటినుండి డబ్బు తెమ్మనమని అడగగా, ఒకటికి రెండుసార్లు తన తండ్రిని అడిగి తెచ్చి ఇచ్చిన మాటా వాస్తవమే. తన తండ్రికి తను ఒక్కతే కూతురు అవ్వటంతో ఆయనా తనకా డబ్బు ఇవ్వటంలో పెద్దగా ఆలోచించిందీ లేదు. ఎప్పటికయినా ఆ ఆస్తంతా తనకు ఇచ్చేదేకదా అన్నట్లుగా అడిగినప్పుడు అడిగినంతా ఇస్తుండేవాడు. కానీ, వాళ్ళ ఒత్తిడి మరీ మరీ ఎక్కువయింది. వాళ్ళు తనని అలా నాలుగోసారి వెళ్ళి తీసుకు రమ్మన్నప్పుడు తన అయిష్టతను వ్యక్తం చేసింది. దాంతో తల్లీకొడుకుల నసుగుడు మొదలయింది. ఏదో వంకన చివాట్లు... మరోసారి తెచ్చింది. అయిదోసారి తెమ్మన్నప్పుడు తాను అంగీకరించక పోగా ఇక వాళ్ళ ఈ అలవాటుకు అడ్డుకట్ట వేయాలనే నిర్ణయించుకున్నది. అందుకే, మరోసారి అలా అడగవద్దని ఖచ్చితంగా చెప్పేసింది. అప్పటిదాకా తిట్లతో సరి పెట్టుకున్న వాళ్ళు చేతులకూ పని కల్పించసాగారు. మూడో సంవత్సరం నుంచి, తనకు పిల్లలు పుట్టలేదనే వంకపెట్టి సూటిపోటీ మాటలతో హింసించడం మొదలుపెట్టారు.. అయిదో సంవత్సరం వచ్చేటప్పటికి ఆ ఇంటికి మరో స్త్రీ తనకు సవతిగా వచ్చింది... తను ఇక నిగ్రహించుకోలేకపోయింది... వెంటనే కట్టుబట్టలతో ఆ ఇంటి గడపదాటి బయటకు వచ్చేసి పుట్టింటికి జేరింది.

తరువాత తన వాళ్ళతోనే చాలాకాలం గడిపింది. బంధువులు కోర్టుకెళ్ళమని సలహా ఇచ్చారు.''కోర్టేం చేస్తుంది,. మహా అయితే భరణం ఇప్పిస్తుంది... తన కూతురు మరొకరి భరణంతో బ్రతకాల్సిన అవసరం లేదు... అది జీవితాంతం సుఖంగా బ్రతికేలా నేను చూడగలను!'' అని కోర్టుకెళ్ళే ప్రసక్తిని మరోసారి తన ముందు తేవద్దంటూ అందరి నోళ్ళూ మూయించాడు తన తండ్రి.

వాళ్ళు చనిపోవటం, తన మేనమామ సలహాతో తను విజయవాడ రావటం, ఈ క్రెష్ తెరవటం, అది నలుగురిలో మంచి పేరు తెచ్చుకోవటం జరిగిపోయింది... తనకు భర్తంటూ లేడనే ఒక్క లోపమే తప్ప తన జీవితం సుఖంగానూ, ప్రశాంతతతోనూ గడిచిపోతోంది.

చేతినిండా పని... అందునా చాలావరకు మూడు సంవత్సరాలలోపు పిల్లలతో రోజంతా గడపటం, స్వంత పిల్లలు లేరనే దిగులే లేనంతగా తృప్తిని కలిగిస్తోంది.

చెంపల మీదగా ఆమె నెరిసిన జుట్టును, పెట్టుకున్న బంగారు రంగు ఫ్రేము కళ్ళజోడు వెనగ్గా ఆమె



కళ్ళను చూస్తున్నాడు చిదంబరం.

''నేనిక్కడున్నానని ఎవరు చెప్పారు మీకు?'' తలెత్తి ఆయన వంకే సూటిగా చూస్తూ అడిగింది.

''నేను చాలాకాలంగా నీకోసం ప్రయత్నిస్తున్నాను... నా మిత్రుడు నిన్నిక్కడ చూచినట్లుగా ఈ మధ్యనే చెప్పాడు. అందుకే గుంటూరులో పని వుండి వస్తూ, అతడికి కనబడింది నువ్వవునో కాదో తెలుసుకుందామని ఇలా వచ్చాను.. నా శ్రమ వృథా కాలేదు!''

''నాకోసం ఎందుకు ప్రయత్నించాల్సి వచ్చింది ఇప్పుడు?... అందునా ఇన్ని సంవత్సరాల తరువాత!'' వింతగా ఆయన ముడతలు పడ్డ ముఖంలోకే చూడసాగింది.

''నువ్వు నాకు దూరమవ్వాలని నేనెన్నడూ కోరుకోలేదు... నువ్వే... నీ అంతట నువ్వే నా ఇంటినుంచి వెళ్ళిపోయావు!'' అన్నాడు నిష్ఠూరంగా.

''సెగపెట్టి వుండమంటే ఎలా ఉండగలుగుతాను.. నా శరీరంలోనూ ప్రవహించేది నెత్తురే... మీరు పెట్టిన వేడికి అది సలసలా కాగటంతో, దాన్ని చల్లబరచుకోటానికి మరో దారి కనిపించక బయటకు వచ్చేశాను... మీరు నన్ను అంతగా అవమానించినా నేను మీకు ఎలాంటి ఇబ్బందీ కలిగించదలుచుకోలేదే... నేను మీరెండోపెళ్ళి తరువాత, కోర్టుకు వెళ్ళి వున్నట్లయితే మీ జీవితం ఏమయివుండేదో తెలుసా?'' కృద్ధుగా అన్నది.

అతడి ముఖం మ్లానమయింది. మాట్లాడలేక పోయాడు.

''ఏ క్షణానైతే మీ ఇంటినుండి, అది నాది కాదు, అనుకుంటూ బయట కాలుపెట్టానో అప్పటినుండే నాకు సుఖశాంతులు లభించినయ్! జైలు జీవితం తప్పి హాయిగా, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోసాగాను!''

''ఇందులో నా పాత్ర చాలా తక్కువ... దానికంతటికీ మా అమ్మే కారణమని నాకే కాదు నీకూ తెలుసు.. అప్పటి నా బలహీనతల్లా – ఆమె మాటలకు ఎదురు చెప్పలేకపోవటమే!... మన వంశం నిలబడాలంటూ సరోజినిని తీసుకువచ్చి నాకు భార్యగా చేసింది ఆమే!'' అన్నాడు జరిగినదానికి నొచ్చుకుంటున్నట్లుగా నంగి నంగిగా అప్పటి తన అశక్తతను వ్యక్తపరుస్తూ.

''మీ తప్పులేదని ఎలా తప్పుకోగలుగుతారు... నా మెళ్ళో మూడు ముళ్లు వేసిన మీరు, జీవితాంతం నాకు తోడు నీడగా వుండాల్సిన మీరు, అమ్మ చెప్పింది గదా అని, నాకు అన్యాయం చేయటం న్యాయమేనా?'' అన్నది ఆమెకు ఆ మాట అంటుంటే దుఃఖం వస్తున్నది, కళ్ళు తడుస్తున్నయి.

తన ఈ మోడయిన బ్రతుక్కు కారణం ఆయన కాదా?;

ఆయన ఆలస్యం చేయలేదు. తన మనస్సులోది బయటపెట్టేందుకు దారి దొరికిందన్నట్లుగా ఆత్రంగా, ''చేసిన ఆ తప్పును సరిదిద్దుకోవాలనే నేను గత కొద్ది సంవత్సరాలుగా నీ కోసం ప్రయత్నిస్తున్నది!''

''చేసిన తప్పును ఎలా దిద్దుకుంటారు?... నా జీవితం ఆనందంగా గడిచిపోవలసిన సమయంలో దూరమయి, కోరికలకే దూరమయ్యే సాయంత్రపు వయస్సులో మీరు అనుకుంటున్నట్లుగా ఆ తప్పు దిద్దుకుంటున్నానంటే నాకు ఒరిగేదేమున్నది? పూలు వాడి, నేల రాలిన తరువాత ఏమి ఆశించి నన్ను మీరు ఇప్పుడు వెతుకుతున్నారు? ఏమి ఆశించి నేను మీకోసం ఎదురు చూడాలి!'' ఆమె కళ్ళలో ఉబుకుతున్న నీటిని నిగ్రహించుకోలేకపోయింది. ధారాపాతంగా నీళ్ళు ఆ కళ్ళు కార్చసాగినయి. ''నా జీవితమే ఎండకు ఎండపోగా ఓ కట్టెలా తయారయ్యాను.. ఓ యంత్రాన్ని అయ్యాను... బ్రతకటానికే తింటున్నాను.. ఆ తిండికోసమే చిన్నపిల్లలను చేరదీసుకొని ఆత్మతృప్తి చెందుతున్నాను!''

అతడు ఆమె మాటలకు నీరసపడిపోయి, ఆ సోఫాలో వెనక్కు జారిగిలబడ్డాడు.

''సరోజిని పోయి రెండు సంవత్సరాలయింది.. ఆమెకు పుట్టిన నా ఇద్దరు కొడుకులూ అమెరికాలో సెటిల్ అయి ఇక ఇండియాకు వచ్చే ప్రసక్తే లేదు అంటున్నారు... నేను వెళ్దామన్నా నా కోడళ్ళకు నా రాక అంత సుముఖంగా వున్నట్లు నాకు తోచటం లేదు... ఆ పైన సరోజిని తమ్ముళ్లు నా ఆస్తి మీద కన్నువేశారు. అందుకే వాళ్లు ఆతురత పడుతూ నామీద అభిమానాన్ని కుమ్మరించేస్తున్నారు.. వాళ్ళ అభిమానమేమిటో స్పష్టంగా అర్థమవుతున్నది... నేనింత కష్టపడి సంపాదిస్తున్నదాన్ని ఎవరెవరో తినటం నాకిష్టంలేదు!''

ఆయన కళ్ళలో తడి ఆమెను అన్యమనస్కురాలిని చేస్తోంది.

– తన డబ్బును హరించాలనుకునే వాళ్ళ నోళ్లు మూయించాలీ అంటే – తను రుక్మిణిని తీసుకువెళ్ళి తన ఇంట పెట్టుకోవటమే మార్గం అని ఆయనకు తెలుసు...

ఒంటరిగా ఉన్నది, ఆత్మీయుల ఆధారంలేదు. అటువంటి ఆమెను, తనతో వచ్చి తన సామ్రాజ్యాన్నంతటినీ ఏలుకోమని సాదరంగా రెండు చేతులూ జాచి ఆహ్వానిస్తే – అంతకు మించిన ఆనందం ఆమెకింకేం ఉంటుంది? – అనేది అతడి ఆలోచన.

''ఈ ప్రపంచంలో ఎవ్వరినీ నమ్మేటట్టుగా లేదు.. కట్టుకున్న భర్తనయినా సరే.. అందుకు నేనే ఉదాహరణ... నువ్వు ఒంటరిగా ఇక్కడ ఉండటం నాకు ఎంతో బాధ కలిగిస్తున్నది!''

ఆయన ఏం చెప్పబోతున్నాడో ఆమెకు అర్థమవుతున్నది.

***

హాట్ప్యాక్లో వున్న వేడి వేడి పూరీలను, ఆలుగడ్డ కూరను ఓ ప్లేట్లో పెట్టి భర్త ఎదురుగ్గా టీపాయ్మీద పెట్టింది ఆ రోజు శనివారమవ్వటంతో. ఆమెకు గుర్తున్నది – ఆయన శనివారం నాడు రాత్రిపూట భోజనం చేయడు.

''మీ రెండవ భార్య ఎలా చనిపోయింది?'' అడిగింది ఉన్నట్లుండి రుక్మిణి.

పూరీ తింటున్న అతడు కొరబోయినట్లుగా దగ్గి, గ్లాసెత్తి మంచినీళ్ళు గడగడా త్రాగాడు.

''మీమీద అనుమానంతో నేను అడగటం లేదు.. నాకు తెలుసు నేను ఆ యింటినుంచి వచ్చిన తరువాత పది సంవత్సరాలకు మీ అమ్మ పోయిందని... మీ రెండో భార్యపోయి రెండేళ్ళే కదా అయింది!'' అన్నది కొంటెగా.

ఆమెకు కడుపులో మండుతున్నది ఇప్పుడు ఆయన రాకలోని ఆంతర్యం అర్థమయినప్పుడు.

పెళ్ళాం చచ్చింది. కొడుకులు వదిలేశారు. సంపాదించిన ఆస్తిని కాజేసేందుకు రాబందులు ఎదురు చూస్తున్నాయి... ఇంట్లో అన్నం వండి పడేసే దిక్కు లేదు.. ఇంటికి రాగానే మంచినీళ్లు ఇచ్చే దిక్కులేదు. తాళి కట్టిన తను ఇంకా బ్రతికే వున్నది... ఆస్తి ఆశ చూపి తీసుకు వెళితే దేనికీ వెతుక్కోకుండా అన్నీ అమరుస్తుంది.. సుఖపడవచ్చు!

రుక్మిణి మాటలు ఆయన బుర్రకు ఎక్కటం లేదు.

ఆమె ఒక్కక్షణం ఆయన వంక చూసి ప్లేట్లను, గ్లాసుల్ని తీసుకొని లోపల సింక్లో పడేసి, రెండు ప్లేట్లలో పూరీలు పెట్టుకొని తీసుకు వచ్చింది.

ఒక ప్లేటును దమయంతిని పిలిచి ఇచ్చి, ఆమె అటు వెళ్ళగానే తన ప్లేటుతో తలుపు పక్కనే కూర్చున్నది.

''చెప్పండి! మీ ఆలోచనేదో స్పష్టంగా చెప్పండి... ఇంతదూరంలో వున్న నన్ను వెతికి వెతికి పట్టుకున్నారూ అంటే మీ మనస్సులో మాట చెబితే నాకు అర్థమవుతుంది!'' అన్నది సూటిగా.



## కార్తీకకి కోపం వచ్చింది!

ఎన్నో ఆశలతో 'జోష్' ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అలనాటి హీరోయిన్ రాధ కూతురు కార్తీకకి ప్రస్తుతం కోపం వచ్చింది. ఆ సినిమాలో మొత్తం ఫోకస్ అంతా నాగార్జున కొడుకు నాగచైతన్య మీద కేంద్రీకరించి తనను నిర్లక్ష్యం చేశారంటూ ఆరోపిస్తోంది. మా ఇద్దరికీ ఆ సినిమా మొదటి సినిమానే అయినా తనను అసలు పట్టించుకోకుండా నాగచైతన్య మీద ఎక్కువ ఇంట్రస్ట్ చూపించారంటూ వాపోతోంది. కార్తీక ఇప్పుడు మలయాళ సినిమాల మీద దృష్టి కేంద్రీకరించింది. ఇక మీదట తెలుగులో చేసేటప్పుడు ఇలాంటి పొరపాట్లు చేయనని చెబుతోంది. దొంగలు పడిన ఆరునెలలకు పోలీసులొచ్చినట్లు 'జోష్' సినిమాను ప్రేక్షకులు మరిచిపోయిన తరుణంలో కార్తీక ఇలాంటి స్టేట్మెంట్లు ఎందుకిస్తోందో తెలియక పలువురు తలలు పట్టుకొంటున్నారు.

కవిత

# ది ‘లాస్ట్’ ఎపిసోడ్ లేక ప్రైమ్ టైమ్ కిల్లింగ్

అవ్వ– పున్నమి రాత్రి చందమామలో తన నీడనొదిలి
పసివాళ్ళకోసం నేలకు దిగొచ్చిన పేదరాసి పెద్దమ్మలా ఉండేది!
అవ్వ–పుటలు నలిగినా అట్టతో సహా పదిలంగా ఉన్న
తాతల నాటి కాశీ మజిలీ కథల పుస్తకంలా ఉండేది!
వెన్నెల కూడా చెవులు రిక్కించిన పిల్లకాయై అవ్వ ఒళ్ళో వాలేది!
వీధి వాకిలే పురిటిగది, అవ్వ మంత్రసాని – కథలెన్నో కేరుమనేవి!
ప్రతి రెండు ‘ఊ’ల నడుమా లేతమనసులు
సప్త సముద్రాల్ని తరవాణిలా జుర్రుకునేవి!
నక్షత్రాల్ని పాలకోవాల్లా చప్పరించేవి!
ఎన్నెన్ని పుష్పక విమానాలో, ఎన్నెన్ని పంచకళ్యాణులో!
రాంబాబులూ, సత్తిగాళ్ళో కాదు – సీతలూ, సత్యవతులూ
పైలట్లయ్యే వారు, రికాబుల్లో కాళ్ళు పెట్టి కళ్ళేలు గుంజేవారు!




***

ఉపగ్రహాల వెలుగులో చిక్కుకున్నాయి వెన్నెలా, నక్షత్రాలూ!
నీటి గుంటల్లోకి చొచ్చుకెళ్ళిన గేలం ముళ్ళలా
ఇళ్ళలో దూరాయి కేబుల్ టీవీ వైర్లు!
వటవృక్షమే గిడసబారే నీడ పరుచుకుంది!
కథాగాన కోకిల గొంతుకు ఎపిసోడ్ల వైరస్ సోకింది!
‘కంచి’పై శీత కన్నేసిన అవ్వ
మనసా వాచా కర్మణా బుల్లితెర భల్లూకానికి మోకరిల్లింది!
కవ్వం పాటలతో నల్లని చీకటిని వేకువ వెన్నగా మార్చిన అవ్వ–
దంపుడు లయతో రాతి రోటికి రాగాలు నేర్పిన అవ్వ
బోసినోటితో రేయింబగళ్లూ
కంచిని మరిచిన సీరియళ్ళ చూయింగ్ గమ్‌ను
ప్రకటనల గుట్కాతో నంజుకుని తినమరిగింది!
నవ్వే తామరలతో గట్లు తొణికిన కొలను గుంటగా మిగిలింది!
నవరస ఖచిత స్వరవాలంతో తరాల్ని గెలిచిన కథన సామ్రాజ్ఞి
మిద్దింట కొలువు దీరిన మహా మాయాదర్పణానికి
మొదటిదాసిగా మారిపోయింది!
వాడలో ఎవరి కంట నలుసుపడ్డా కన్ను మెరిగిన అవ్వ–
ఏ బిడ్డ ఏడ్చినా కడుపు కదిలిన అవ్వ
‘ప్రైమ్ టైమ్’లో – పక్కింట్లో పాడె కట్టినా
మిద్దింటి గడప దాటలేదు!
దాటొచ్చిన శోకాలకు చెవినివ్వలేదు!

***

ఓ వెన్నెల రాత్రి–
వెయ్యిన్నొక్క ఎపిసోడ్లో తుపాకీ పేలింది!
నాలుగో పెళ్ళికి బాసికం కట్టుకున్న పాత్రడు
నిమిషాలకు నిమిషాలు స్లో మోషన్‌లో నేలకొరిగాడు!
‘చచ్చిపోయాడల్లో’ కెవ్వున అరిచిన అవ్వ గుండె మాత్రం
తక్షణమే ఆగిపోయింది!
వీధి వాకిట చేరింది కట్టె–
‘చందమామ’ కథకి ముగింపులా!

(తూర్పు గోదావరి జిల్లా చీపురుపల్లిలో ఓ వయో వృద్ధురాలు సీరియల్‌లోని పాత్ర హత్యకు గురవడాన్ని తట్టుకోలేక ‘చచ్చిపోయాడల్లో’ అని అరిచి, టీవీ ముందే కుప్పకూలి చచ్చిపోయిందని విని)

–‘వి–రాగి’

అతడు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు ఆమె అడుగుతున్న తీరుకు నోరు పెగలటం లేదు.

“మీరు ఓ సమస్యతో వచ్చారు.. ఏ నిర్ణయం తీసుకోవాలనుకున్నా కూలంకషంగా చర్చించటంలో తప్పులేదు... వ్యాపారస్థులయిన మీకు చెప్పేదేమున్నది... ఏ పనినైనా లాభనష్టాలను తూకమెయ్యకుండా చేస్తారా?'' ఆయన్నే చూస్తూ అన్నది.

ఆమె తన మనస్సులోని మాటను అర్థం చేసుకున్నా ఇంకా డొంకతిరుగుడుగా మాట్లాడుతుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఆమె మాటలకు ఏర్పడుతున్న అక్కసును నిగ్రహించుకుంటూ, “చెప్పాను కదా... నా కష్టార్జితాన్ని పరాయివాళ్ళెవరో వచ్చి తినటం నాకిష్టం లేదు... నేను ఇప్పటికీ నీ భర్తనే.. ఆ విషయంలో నీకు సందేహం లేదుగదా!... మనం విడాకులు తీసుకోలేదు!'' అన్నాడు.

“కానీ మనం ముప్పది సంవత్సరాలు ఒకరినొకరం చూడకుండా జీవితం గడిపాం. అది విడాకులు తీసుకున్న దానికంటే కూడా బలమైనదనే అనుకుంటున్నాను!''

“స్వంత భర్త కాకుండా ఎవరూ వచ్చి అప్పనంగా లక్షలకు లక్షలు ఆస్తిని అనుభవించమని చెప్పరు కదా!'' విసురుగా అన్నాడు కోపంతో – తనను ఆమె అవమానిస్తున్నదనిపించగా.

“భర్తలే వుంటారుగాని.. అందులో స్వంత భర్తలు, అద్దె భర్తలు అంటూఉండరు!'' ఫక్కున నవ్వింది.

కృద్ధుగా ఆమె వంక చూచాడు చిదంబరం.

“ఇక్కడ నా అన్నవాళ్ళు లేక ఒంటరిగా పడి వుండి, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా ఒళ్ళు విరుచుకుంటూ నాలుగు రూకలకోసం నిర్జీవంగా బ్రతికేదానికంటే... నా దగ్గరకు వచ్చి, కాలు క్రింద పెట్టకుండా సర్వసౌఖ్యాలూ అనుభవిస్తూ ఆనందించమంటుంటే.. ఎందుకీ లేనిపోని పిచ్చి ఆలోచనలు, చర్చలు, ప్రశ్నలు?''

“సరే! ఓకే!... నావాళ్ళంటూ లేకుండా నేను ఇక్కడ ఒంటరిగా బ్రతుకుతున్నాను... అటువంటి నన్ను నా భర్త వచ్చి తన దగ్గరకు రమ్మనమంటే.. వెళ్ళటంలో తప్పేం లేదు.. వెళ్ళకపోతే.. ఆ విషయం తెలిసిన నలుగురూ నన్నే తప్పు పడతారు... కానీ అక్కడకు వచ్చిన తరువాత... అమెరికానుండి మీ కొడుకులు... అదే మీ రెండో భార్యకు పుట్టిన కొడుకులు వచ్చి మీరు చేసిన పనిని ప్రశ్నిస్తే మీరేం సమాధానం చెబుతారు?'' అన్నది ఓరగా ఆయన్ను చూస్తూ.

“ఆస్తి అంతా నా కష్టార్జితం... వాళ్ళెవ్వరు నన్ను అడిగేందుకు... అసలు వాళ్ళ రామనే చెబుతున్నారు కదా!''

“వస్తే?'' మొండిగా అన్నది.

ఆమె ప్రశ్న చికాకు కలిగించింది చిదంబరానికి.

“అంటే నా ఆస్తినంతా నీ పేరుమీదకు ముందుగానే మార్చమంటావా?'' గుండెల్లో మంట రేగుతోంది అతడికి.

“ఇప్పుడు ఆస్తి ప్రశ్న ఎక్కడ వచ్చింది... మీరు నన్ను మీ ఇంటికి తీసుకువెళ్ళటానికి వచ్చారు... వెళ్ళాలావద్దా అని ఆలోచించుకుంటున్నాను... రేపు మీ కొడుకులు వచ్చి నన్ను ఆ ఇంటినుంచి బయటకు గెంటితే నేనేం చేయాలి అనేది నా భయం... అప్పుడు ఇక్కడ ఈ నా ఆధారమూ పోవటమే గాకుండా నామీద ఆధారపడి పాతికమంది పిల్లలకు అన్యాయం చేసినదానినవుతాను.. మీ ఒక్కరి కోసం వాళ్ళందరినీ నావాళ్లు కాదూ అనుకుంటూ వదిలేసి రావాలా అనేదే నా ప్రశ్న?''

“ఊళ్ళోవాళ్ళ పిల్లలకోసం పెళ్ళి చేసుకున్న భర్తను వదు

లుకుంటావా?''

''పెళ్ళి చేసుకున్న భర్తే భార్యను ముప్పయి సంవత్సరాలు తనకు అవసరం లేదనుకుంటూ వదులుకోగా లేంది – నేను చేసేది ఎంత?''

''నేను నిన్ను వదులుకోలేదు... పిల్లలకోసం మరో భార్యను తెచ్చుకున్నాను... నువ్వే నన్ను వదలి వెళ్ళి పోయావ్!''

రుక్మిణి పకపకా నవ్వింది.

''నాకు పిల్లలు ఎందుకు కలగటం లేదో తెలుసుకోటానికి ఎప్పుడయినా డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళారా? ఎవరినైనా సంప్రదించామా? లేదు.. నా పుట్టింటినుంచి మీరు అడిగినప్పుడల్లా అడిగినంత డబ్బు తేనన్నానని నా మీద దెబ్బకొట్టటానికే మరో మనిషిని నాకు సవితిగా తీసుకువచ్చి ఆ ఇంట కూర్చో బెట్టారు.. వాళ్ళ దగ్గర మీరెంత గుంజారో నాకు తెలియదు.. వారికి మీరేం మాటిచ్చారో నాకు తెలియదు... మీరు నన్ను కోలుకోని విధంగా అణగదొక్కాలనుకున్నారు కాబట్టే నేను మీ ఇంటినుండి బయటకు రావాల్సి వచ్చింది!''

ఆయన కుప్పలా కూలిపోయినట్లుగా ఆ సోఫాలో వెనక్కు వాలిపోయాడు.

''నేను వస్తూనే గోడనున్న మన ఫొటోని చూచి బాధపడుతుంటే నువ్వేమన్నావ్... గతాన్ని గురించి ఆలోచిస్తూ బుర్ర పాడుచేసుకోవద్దు అన్నావ్.. అటువంటి నువ్వే గతాన్ని తవ్వి, నా నెత్తిన సమ్మెటపోట్లు వేయటంలో అర్థమేమిటి?''

''మీరు నన్ను ఎప్పుడో మరిచిపోయారు గనుక...!'' అంటూ చటుక్కున లేచి, ''ఒక్కక్షణం... దోమలు మొదలయినట్లున్నయి... కాయిల్ వెలిగించుక వస్తాను!'' అంటూనే పక్కగదిలోకి వెళ్ళింది రుక్మిణి.

– ప్రేమగా పాలతో స్నానం చేయిస్తూ, నిప్పులతో తుడుస్తున్నట్లుగా ఉన్నది ఆమె మాటతీరు, ప్రవర్తనా ఆయనకు!

ఆమె రెండు నిమిషాలల్లోనే హాల్లోకి వచ్చి చేతిలో ఉన్న వెలుగుతున్న కాయిల్‌ను గోడవారగా స్టూలు మీద పెట్టింది.

''భార్యకు డబ్బులిచ్చి తనదానిగా చేసుకోవాలనుకోవటం వ్యాపారం... ఆమె మనసెరిగి దగ్గరకు తీయటం ఆప్యాయత... స్వలాభం కోసం భార్యను దూరం చేసుకోవటం హేయం!''

''రుక్మిణీ! నువ్వు ఎవ్వరితో మాట్లాడుతున్నావో తెలుసా?'' ఆయన కఠినంగా అన్నాడు ఆమె మాటలకు గుండెల్లో ఎగతన్నుకొస్తున్న కోపాన్ని నిగ్రహించుకోలేక. ''నేను నీ భర్తను!''

''నేను ఆ మాట కాదంటేనే గదా మీరు చెప్పవలసింది... నేను మీరన్నట్లుగా మీ దగ్గరకు వచ్చి మీ డబ్బుతో, భోగభాగ్యాలతో తులతూగుతుంటే ఎవరికి ఆనందం కలుగుతుందీ అంటున్నాను... నాకా? మీకా?''

''నా డబ్బు అనుకోవటం లేదు... మన డబ్బు అనుకుంటున్నాను!'' ముఖానికి గంటు పెట్టుకుంటూ అన్నాడు.

''ఎట్టి పరిస్థితులలోనూ అది నా డబ్బుకాదు...!'' రుక్మిణి నాన్నుడు ఇష్టం లేనట్లుగా సూటిగా చెప్పింది.

ఆయన ఇక మాట్లాడలేకపోయాడు. ఆమె ధోరణికి అతడి శరీరం భగభగా మండిపోతున్నది.

''అయితే ఏమంటావ్?'' అన్నాడు విసురుగా.

''అనేందుకేమున్నది – మీ ఇంటికి మీ భార్యగా వచ్చి మీ ఆస్తినంతటినీ అనుభవించే శక్తి నాకు లేదు అంటున్నాను... నాకు అంగీకారం కాదు అంటున్నాను!'' ఆమె కుర్చీలో నుంచి లేచింది. ''ఇప్పటికే పది గంటలయింది... ఆ గదిలో మీ పడక ఏర్పాట్లు చేస్తాను.. పడుకొని నిద్రపోండి.. ఎప్పుడైనా సరే ప్రశాంతంగా నేను చెప్పింది ఆలోచిస్తే మీకు నా మాటల్లోని భావం, న్యాయం అర్థమవుతుంది!''

ఆయన నీరసంతో ఆ సోఫాలోనే కళ్ళు మూసుకు కూర్చున్నాడు.

ఆమె వంట యింట్లోకి వెళ్ళి రెండు గ్లాసులతో చిక్కటి మజ్జిగ తెచ్చి టీపాయ్ మీద పెడుతూ, ''త్రాగండి... హాయిగా వుంటుంది!'' అన్నది తనూ ఓ గ్లాసు తీసుకుంటూ.

''ఎంత పొద్దుబోయిందని... నేనువెళతాను.. ఎంతో ఆశతో నిన్ను వెతుక్కుంటూ వచ్చాను.. మన యింట్లో నా తదనంతరం గూడా మన ఇంటి మనిషే దీపం వెలిగిస్తుంటుందని ఆశించాను.. నా చివరి రోజులు ప్రశాంతంగా గడిచిపోతయ్యని విశ్వసించాను!''

ఆమె ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయలేదు. ''నేను ఇంకా మీ భార్యనే అంటున్నారు కాబట్టి నేను మరో మాట చెబుతాను... మీరే ఇక్కడకు రండి... అయితే, మీరనుకుంటున్న మీ ఆస్తిలో ఒక్కపైసా కూడా ఇక్కడకు తీసుకురావద్దు. నాకు అదంటేనే పరమ అసహ్యం!''

''అంటే అక్కడివన్నీ వదిలించుకొని బికారిగా వచ్చి నీ పంచన పడివుండమంటావా!''

ఆమె ఫక్కున నవ్వింది. ''వ్యాపారస్థులకు ఎప్పుడూ డబ్బు యావే.. బికారిగా దేనికి?.... ఈ ఇంటి యజమానిగా రండి!... నా అనుభవం నాకు నేర్పింది ఒక్కటే.. డబ్బే ఈ వ్యథలన్నిటికీ మూలం... నేను మీ ఇంటినుంచి ఎలా వచ్చానో అలాగే మీరు గూడా ఆ యింటినుంచి రావాలనేదే నా ఉద్దేశ్యం!..... మీ డబ్బు, మీ ఆస్తి ఎవరికి ధారాదత్తం చేసుకుంటారో, దానమిచ్చుకుంటారో నాకనవసరం... అలా మీరు ఎప్పుడైనా రావచ్చు.. అప్పుడే మనం దగ్గరయ్యే అవకాశం ఏర్పడుతుంది... మనం ఒకళ్ళనొకళ్ళ అవగాహన చేసుకునే అవకాశం ఏర్పడుతుంది!''

చిదంబరం వెళ్ళిపోయేటందుకు అన్నట్లుగా లేచి నిలుచున్నాడు.,

''నీ నిర్ణయాన్ని మరోసారి ఆలోచించుకోలేవా?'' అన్నాడు రుక్మిణిని అభ్యర్థనగా చూస్తూ.

''ఇంతవరకూ నా జీవితాన్ని నేనెంతో నిబద్ధతతో గడిపాను.. ఇకముందూ అలాగే గడపాలనుకుంటున్నాను!''

చిదంబరం విసురుగా వెనక్కు తిరిగాడు. ''వస్తాను మరి... ఆలోచించు... నా ఫోను నంబరు, చిరునామా ఉన్న కార్డు టెలిఫోన్ దగ్గర పెట్టాను!'' తన కళ్ళల్లో చిరు ఆశను వెలిగించుకుంటూ ఆఖరిసారిగా చెప్పాడు.

''నేనిక ఆలోచించేదేమీ లేదు... మీరే ఆలోచించుకోండి... నేను చెప్పినట్లు మీరు చేస్తే, అది ఇద్దరికీ మేలు చేయటమే కాదు, ఎవరికీ మనస్తాపం కలిగించదు!'' అన్నది మనస్సును తడుపుకుంటూ ఓ నిట్టూర్పు విడిచి.

ఆయనకు డబ్బే ప్రథమ కళత్రం... తను డబ్బు మనిషికి భార్యగా బ్రతకలేదు!

*

రచయిత సెల్: 9948319407



## చిన్న హీరోలకు ముద్దు పెట్టను!

'హాయ్','కల్యాణరాముడు', 'సంబరం' ఫేమ్ నిఖిత లెవల్ పెరిగిందని పలువురు అంటున్నారు. దాదాపు పది పన్నెండు సినిమాలలో హీరోయిన్‌గా నటించిన నిఖితకి అవకాశాలు అరాకొరాగా వస్తున్నా, ఫోజులు మాత్రం 'తారాస్థాయి'లో కొడుతోందని వారు చెబుతున్నారు. వీరి మాటలకు ఊతం ఇస్తున్నట్లుగా నిఖిత ఇటీవల ఓ స్టేట్‌మెంట్ ఇచ్చింది. తాను పెద్ద హీరోలకి తప్ప సినిమాలలో చిన్న హీరోలకు ముద్దు పెట్టను అని చెప్పింది. ఇది మాటలకి కాకుండా చేతలలో కూడా చూపించడంతో ఆమెతో సినిమాలు చేయాలనుకున్న దర్శకనిర్మాతలు వెనక్కు తగ్గుతున్నారట.